నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 28 ఆగస్టు 2024 RANGAREDDY



శంషాబాద్ పట్టణంలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

## గోధుమగూడలో మద్యపాన నిషేధంపై గ్రామస్తుల తీర్మానం



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రాన్ని అందజేస్తున్న గోధుమగూడ గ్రామస్తులు

వికారాబాద్, ఆగస్టు 27 : తమ గ్రామంలో మద్యపానం నిషేధించాలని గోధుమగూడ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు, జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ రాఘవీణకు గ్రామస్తులు వినతి పత్రాలను అందజేశారు. తమ గ్రామం చుట్టూ రిసార్ట్స్ అధికంగా ఉండడంతో టూరిస్టులు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గోధుమగూడ గ్రామ మహిళలు తెలిపారు. మద్యానికి బానిసలైన యువత అర్ధరాత్రి సైతం బెల్ట్ షాపుల ముందు గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మాజీ సర్పంచ్‌లు అనితాసత్యయ్య గౌడ్, తుకారాం, మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి నర్సింహులు, ప్రవీణ్ ఉన్నారు.

## కవితకు బెయిల్
# బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

వికారాబాద్, ఆగస్టు 27 : ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తప్పుడు కేసు నమోదు చేసి ఐదు నెలలు జైలులో ఉంచిన తర్వాత న్యాయం గెలిచిందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. కుట్ర కోణంలో పెట్టిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్కకి సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. దీంతో పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆనందంతో పాటు ఎంతో బలాన్నిచ్చిందని తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీతో ఆధారం లేని కేసులను పెట్టించి రాజకీయ కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా సుప్రీం కోర్టు ఎమ్మెల్సీ కవితకు న్యాయం చేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, నాయకులు సుభాన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, యువ నాయకులు షఫీ, అనిల్ తదితరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆనంద్ నివాసం వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వీట్లు తినిపించుకొని సంబురాలు చేసుకున్నారు. సంబురాల్లో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.




తన నివాసం ఎదుట సంబురాలు చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు

### షాద్‌నగర్‌లో పండుగ వాతావరణం

షాద్‌నగర్, ఆగస్టు 27 : కక్షపూరిత రాజకీయాలకు పాల్పడి, ఆధారాల్లేని కేసుతో ఎమ్మెల్సీ కవితను బీజేపీ ప్రభుత్వం వేధించిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కేవలం బీఆర్ఎస్‌పై ఉన్న కక్షతోనే మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె అయిన ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు బనాయించి.. ఐదు నెలల పాటు జైల్లో ఉంచడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నటరాజన్ ఆధ్వర్యంలో మంగళవారం షాద్‌నగర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని హర్షిస్తూ బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. తెలంగాణ ఆడబిడ్డకు అన్యాయం చేసిన మోదీ ప్రభుత్వానికి రానున్న రోజు ల్లో తగిన బుద్ధి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఈగ వెంకట్రాంరెడ్డి, రాజ్యలక్ష్మి, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, ముస్తాఫా, భాస్కర్, రాజశేఖర్, రాఘవేందర్‌గౌడ్, టీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.




షాద్‌నగర్ చౌరస్తాలో మిఠాయిలు పంచుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

### శంషాబాద్‌లో..

శంషాబాద్ రూరల్ : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై మంగళవారం శంషాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం సంతోషంగా ఉన్నదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కవితను అరెస్ట్ చేయించి ఆనందపడ్డారని విమర్శించారు. ఐదు నెలలు జైలులో పెట్టినా.. లిక్కర్ కేసులో ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా ఉన్న నాయకులను ఈడీ పేరుతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, దిద్యాల శ్రీనివాస్, మంచర్ల మోహన్‌రావు, చిన్న గుండు రాజేందర్, కుంచె జంగయ్య, కొమ్మ గోపాల్, లింగంశ్రీశైలం, జీ అశోక్, హరికృష్ణ, గుంటి చరణ్, రొడ్డ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిముక్కలలో
# 33 శాతమే..

**300 మంది రైతులకుగాను 100 మందికే రుణమాఫీ**

**రేషన్‌కార్డు, బ్యాంకర్ల తప్పిదాలతో రుణమాఫీకి దూరమైన రైతులు**

**వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు గ్రీవెన్స్‌కు 6 వేల ఫిర్యాదులు**

**రేషన్‌కార్డు లేకపోవడంతో సుమారు 2 వేల మందికి కాని రుణమాఫీ**

వికారాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రుణమాఫీకాని రైతులు ఆందోళన బాట పట్టారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ కార్యాలయంతోపాటు మండల వ్యవసాయ కార్యాలయాలకు ఊరూరా కదిలి వస్తున్నారు. మేం తీసుకున్న రుణాలు రూ.2 లక్షల్లోపే ఉన్నా ఎందుకు మాఫీ చేయలేరంటూ అధికారులను నిలదీస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నిబంధనలతో జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ 60-70 శాతం మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. వికారాబాద్ మండలంలోని గొట్టిముక్కలలో కేవలం 40 శాతం మంది రైతులకు సంబంధించిన రుణాలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసింది. గొట్టిముక్కల గ్రామంలో రూ.2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న రైతులు సుమారు 300 మంది ఉండగా, వీరిలో కేవలం 100 మంది రైతులకు సంబంధించిన రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగతా 60 శాతం మంది రైతుల రుణాలు రూ.2 లక్షల్లోపు ఉన్నప్పటికీ మాఫీ కాలేదు. రుణమాఫీకాని రైతుల్లో ఎక్కువ మంది రేషన్‌కార్డు లేకపోవడంతోనే నష్టపోయారు. పేరు ఒకరిది ఆధార్ నంబర్ మరొకరిది.. రైతుల పేర్లు తప్పుగా నమోదు చేయడం.. ఆధార్‌లో ఉన్న పేరుకు పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న పేరు ఒకేలా ఉండకపోవడం.. ఇలా రుణమాఫీ జాబితా తప్పుగా నమోదు కావడంతోపాటు రైతులు ఏటా రెన్యువల్ చేసుకున్నప్పటికీ.. రెన్యువల్ చేసుకోలేదని బ్యాంకర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతో చాలా మంది రైతులు నష్టపోయినట్లు స్పష్టమవుతున్నది. వ్యవసాయ కార్యాలయాలకు వెళ్తే వివరాలను తెలుసుకొని పంపిస్తున్నారని గ్రామ రైతులు పేర్కొంటున్నారు. రేషన్‌కార్డు మెలిక పెట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాకు అన్యాయం చేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలోపు రుణాలు అర్హులందరికీ మాఫీ అయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన షరతులతో నష్టపోయామని రైతులు వాపోయారు.

### గ్రీవెన్స్‌కు 6 వేల ఫిర్యాదులు..

జిల్లాలో రుణమాఫీ కాలేదని వస్తున్న ఫిర్యాదులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 6 వేల ఫిర్యాదుల వరకు గ్రీవెన్స్ వచ్చాయి. గ్రీవెన్స్‌లో అత్యధికంగా సుమారు 2 వేల ఫిర్యాదుల వరకు రేషన్ కార్డు లేకపోవడంతోనే రుణమాఫీకి దూరమైనట్లు తెలుస్తున్నది. గత 20 రోజులుగా వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా త్వరలో మీ రుణాలు మాఫీ అవుతాయంటూ సమాధానం చెబుతూ రైతులను పంపించేస్తున్నారు. వ్యవసాయాధికారులు, బ్యాంకర్లు చెబుతున్న సమాధానాలకు ఏ మాత్రం పొంతన లేకపోవడంతో వ్యవసాయ కార్యాలయాల వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చే రైతులకు వ్యవసాయాధికారులు ఏదో ఒకటి చెబుతూ పంపిస్తున్నారు. మరోవైపు రూ.2 లక్షల రుణాలకు మించి ఉన్న రైతుల పరిస్థితి మరీ గందరగోళంగా తయారైంది. కటాఫ్ రుణానికి మించి ఉన్న రైతుల్లో చాలా మంది ఇప్పటికే పైన ఉన్న రుణాలను చెల్లించి సంబంధిత రసీదులను వ్యవసాయాధికారులకు అందజేసినప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కటాఫ్ రుణాన్ని చెల్లిస్తేనే మాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నప్పటికీ ఎప్పుడు మాఫీ అవుతుందని, దానికి సంబంధించిన విధివిధానాలు ఇప్పటివరకు ఖరారు కాకపోవడం గమనార్హం.

### ప్రతి ఏడాది రెన్యువల్ చేశాం..



నాకు 4 ఎకరాల భూమి ఉన్నది. వికారాబాద్ యూనియన్ బ్యాంకులో రూ.1.60లక్షలు రుణం తీసుకున్నా. నా భార్యకు ఒకటిన్నర ఎకర పొలం ఉన్నది. రూ.80వేలు తీసుకున్నాం. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేశాం. రెండు, మూడో విడుత అంటూ అధికారులు మాట దాటవేశారు. ప్రస్తుతం వ్యవసాయాధికారులను అడగగా వస్తాయి అంటూ సమాధానమే చెబుతున్నారే తప్పా మాఫీ కావడం లేదు. రేషన్ కార్డు కారణమని చెబుతున్నారు. ఎన్నికల ముందు రుణ మాఫీ చేసే సమయంలో ఇలాంటి షరతులు ఎందుకు తెలుపలేదు.

– వెంకటేశ్, గొట్టిముక్కల, వికారాబాద్

### సరైన సమాధానం లేదు..



ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. నాకు రూ.1.80 లక్షలు అప్పు ఉన్నది. నా పేరుపై 3.30ఎకరాల భూమి ఉన్నది. 2018లో వికారాబాద్ యూనియన్ బ్యాంక్‌లో రుణం తీసుకున్నా. ఏటా రెన్యువల్ చేశా. నాతో పాటు మా గ్రామంలో 60 శాతం వరకు మాఫీ అయ్యాయి. మాకెందుకు కాలేదని అధికారులను అడిగితే ఎప్పుడు వస్తాయో మాకు కూడా తెలియదని చెబుతున్నారు.

– కొండాపురం రామకృష్ణ, గొట్టిముక్కల, వికారాబాద్

### కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలె..



ఎన్నికలప్పుడు ఎలాంటి షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట నిలబెట్టుకోవాలి. నాకు మూడు ఎకరాల భూమి ఉన్నది. వికారాబాద్ యూనియన్ బ్యాంకులో రూ.లక్ష, శివారెడ్డిపేట సొసైటీ బ్యాంకులో రూ.1.30 లక్షల రుణం తీసుకున్నా. శివారెడ్డిపేట సొసైటీలో రెన్యువల్ చేశాం. గత కొన్ని రోజుల కింద బ్యాంకు అధికారులకు రూ.7వేల రుణాన్ని సైతం చెల్లించినా రుణం మాఫీ కాలె. రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు.

– పట్లే ఆంజనేయులు, గొట్టిముక్కల, వికారాబాద్

రుణమాఫీ కాకపోవడంతో రైతులు సాగు పనులను వదులుకుని బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ రోజుల తరబడిగా ప్రదక్షిణలు చేశారు. బాధిత రైతుల నుంచి పెద్ద ఎత్తున అధికారులకు దరఖాస్తులు సైతం అందాయి. ఇకనైనా తమ సమస్య పరిష్కారమవుతుందని ఆశించిన రైతన్నలకు సర్వే పేరుతో ప్రభుత్వం సాగదీసే ప్రయత్నాలకు పూనుకున్నది. ప్రభుత్వం చెప్పినట్లుగా.. మంగళ వారం నుంచి ఇంటింటి సర్వేను చేపట్టాల్సి ఉండగా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రారంభం కాలేదు. యాప్‌పై స్పష్టత లేక అందుబాటులోకి తీసుకురాలేకపోవడం వల్లే సర్వేను చేపట్టలేదని తెలుస్తున్నది. రోజుకో ప్రకటనతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో.. బాధిత రైతన్నలు చిక్కులు తొలగి మాఫీ అయ్యేనా ? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తూ ఆందోళన చెందుతున్నారు.

– రంగారెడ్డి, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ)



# చిక్కులు తొలగేనా!
# మాఫీ అయ్యేనా?

**ఇంటింటి సర్వే..ధ్రువపత్రాల పరిశీలన చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**జిల్లాలో మంగళ వారం మొదలుకాని సర్వే.. యాప్‌ను అందుబాటులోకి తేకపోవడం వల్లనే !**

**జిల్లాలో ఇప్పటికే వేల సంఖ్యలో ఫిర్యాదులు.. మళ్లీ సర్వే ఎందుకని ప్రశ్నిస్తున్న బాధిత రైతులు**

**గతంలో ఇచ్చిన దరఖాస్తులు బుట్టదాఖలేనా ?.. మళ్లీ ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలి ?**

**మాఫీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా.. లేదా..?**

**పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్న జిల్లా రైతాంగం**

### గత ఫిర్యాదుల మాటేమిటి ?

రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 49,471 మందికి రూ.257.19కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. రెండో విడుతలో 22,915 మంది రైతులకు సంబంధించిన రూ.218.13 కోట్లను, మూడో విడుతలో 15,226 మంది రైతులకు రూ.185.40కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. మూడు విడుతల్లో కలిసి జిల్లాలో 87,612 మందికి రూ.660.72 కోట్లను మాఫీ చేసింది. అర్హులు లక్షల్లో ఉండగా.. కేవలం వేలల్లోనే రుణమాఫీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొన్నది. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా చాలామంది రైతులు అర్హులైనా... రుణం మాఫీ కాలేదు. రేషన్ కార్డు, ఇతర సాంకేతిక కారణాలతో బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రైతు వేదికలతోపాటు నిర్దేశించిన కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నోడల్ అధికారులు ఫిర్యాదులను తీసుకుంటున్నారు. గతంలో వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయగా రైతుల నుంచి వెల్లువలా ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం చెబుతున్న ప్రకారం.. ప్రతిసారీ రైతులు అధికారులకు దరఖాస్తులు ఇస్తూ వస్తున్నారు. సుమారుగా 16 వేలకు పైగానే దరఖాస్తులు అధికారులకు అందినట్లు తెలిసింది. కానీ.. రోజుల తరబడిగా వాటికి పరిష్కారం మాత్రం లభించడం లేదు. తాజాగా ప్రభుత్వం ఇంటింటి సర్వే చేస్తామని చెబుతుండడంతో గతంలో ఇచ్చిన ఫిర్యాదుల మాటేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అవన్నీ బుట్టదాఖలేనా!. అన్న సందేహాలను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాలో మొదలుకాని సర్వే..

రుణమాఫీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ వర్తించని వారి ఇండ్ల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయి సమాచారం తెలుసుకుని యాప్‌లో వివరాలను నమోదు చేయడం వల్ల మాఫీని వర్తింపజేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇందులో భాగంగా కుటుంబ యజమానితో ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు తీసుకోనున్నారు. రుణ ఖాతా, బ్యాంకు బ్రాంచి వివరాలతోపాటు, మాఫీ కోసం కుటుంబ సభ్యుల వివరాలను ఇష్టపూర్వకంగా ఇస్తున్నట్లు పేర్కొంటూ సంతకం చేసి కుటుంబ యజమాని ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని ధ్రువీకరిస్తూ గ్రామ కార్యదర్శి సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మంగవారం నుంచి ప్రారంభమవుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే జిల్లాలో ఈ ప్రక్రియ ఆచరణలోకి రాలేదు. యాప్ రాలేదని, త్వరలోనే దీనిపై ఓ స్పష్టత వస్తుందని జిల్లా అధికారులు తెలిపారు. గతంలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించకుండా ఇంటింటి సర్వే చేస్తామని ప్రకటించడం.. తీరా యాప్ రాలేదంటూ సర్వేను సైతం మొదలు పెట్టకపోవడంతో రైతులు అసహనం చేస్తున్నారు. నిత్యం బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నామని జిల్లా యంత్రాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇప్పటికే పలుమార్లు వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు చేశామని రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మాఫీ చేసే ఆలోచన ఉందా ? లేదా ! అని మండిపడుతున్నారు. రోజుకోమాట చెప్పి రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.